


## అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారు

పట్టణంలోని శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో అమ్మవారు గురువారం అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో హోమం, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శంభురెడ్డి దంపతులు, వినోద్, శ్రీనివాస్, అరుణ్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

• బాన్సువాడటౌన్



గ్రామసభ నిర్వహిస్తున్న గ్రామస్థులు

## మద్యానికి మేం వ్యతిరేకం

» మద్యాన్ని నిషేధిస్తూ బూర్గుల్ గ్రామస్థుల తీర్మానం

మహమ్మద్‌నగర్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మద్యం ఎవరూ తాగబోమని.. గ్రామంలో మద్యం విక్రయించొద్దని మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్ గ్రామస్థులు తీర్మానం చేశారు. గురువారం గ్రామసభ ఏర్పాటు చేసుకుని మద్యం నిషేధానికి గ్రామస్థులంతా ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. మద్యానికి బానిసై గ్రామంలో చాలా కుటుంబాలు గొడవలకు కారణమవుతుందని, జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని తెలిపారు. ఇప్పటికే మండలంలోని తూంకీపల్లి గ్రామంలో మద్యపాన నిషేధం కొసాగుతుండగా బూర్గుల్‌లో సైతం ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై మండల ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. మిగితా గ్రామాలు సైతం తోవలోనే నడవనున్నట్లు సమాచారం.



## చిత్తూ.. చిత్తూల బొమ్మ

» జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు

---

### బిచ్కుంద, ఎల్లారెడ్డి అభివృద్ధికి
## రూ.30 కోట్లు మంజూరు

బిచ్కుంద/ఎల్లారెడ్డి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద, ఎల్లారెడ్డి మునిసి పాలిటీ అభివృద్ధికి రూ.30కోట్లు మంజూరయ్యాయి. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషితో బిచ్కుంద మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.15కోట్ల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంజూరైన నిధులతో మునిసిపాలిటీ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మునిసిపాలిటీ కార్యాలయ నిర్మాణం ఇతర పనులు చేపట్టనున్నట్లు వివరించారు. నిధులు మంజూరు చేసిన సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నౌషానాయక్, గౌస్, ఖలీమ్, గంగారాం,అశోక్, హన్మండ్లు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డికి రూ.15 కోట్లు..**

ఎల్లారెడ్డి మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేసినట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, అర్బదనం మరమ్మతుల నిర్మాణం కోసం రూ.6 కోట్లు, పెద్ద చెరువుకట్ట వద్ద విశాలమైన పార్కు నిర్మాణానికి రూ.3 కోట్లు, మునిసిపల్ వ్యాపార సముదాయానికి షాపింగ్ నిర్మాణం కోసం రూ.5కోట్లు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీకి విద్యార్థి ఎంపిక

పాల్వంచ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కృషివల్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు గురువారం పీడీ రేణుక తెలిపారు. నేటి నుంచి 3రోజులపాటు నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కృషివల్ పాల్గొనన్నుట్లు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



# మద్యం టెండర్లు

» ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
» తాజాగా షెడ్యూల్ జారీ
» నేటి నుంచి అక్టోబరు 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
» 23న లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు
» దరఖాస్తుల ఫీజు రూ.3 లక్షలు
» డిసెంబర్ నుంచి వైన్స్‌లు దక్కించుకున్న వారికి నిర్వహణకు అవకాశం
» జిల్లాలో 49 మద్యం దుకాణాలు
» రిజర్వేషన్ల ప్రకారం దుకాణాల కేటాయింపు

కామారెడ్డి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు షెడ్యూల్ వస్తే మద్యం దుకాణాలకు టెండర్లు వేసే అవకాశం ఉండకపోవడం ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాదనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలకు వేలం వేయాలని నిర్ణయించింది. ఇందులో భాగం గా ఇదివరకే మద్యం దుకాణాల కొత్తపాలసీ నోటిఫికేషన్‌ను విడుదలచేసిన విషయం తెలిసిందే. తాజాగా టెండర్లకు సంబంధించి షెడ్యుల్‌ను ప్రభుత్వం జారీ చేసింది. జిల్లాలో 49 మద్యం దుకాణాలు ఉన్నాయి. వైన్స్‌లకు ప్రభుత్వం టెండర్లు పిలువనున్న నేపథ్యం లో మద్యం వ్యాపారు లు సైతం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే దరఖాస్తు రుసుము రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్‌ను జారీచేసింది. అయితే ఎన్నికల నేపథ్యంలో మద్యం టెండర్లు అధికంగా వస్తాయని సంబంధితశాఖాధికారులు భావిస్తున్నప్పటికి దరఖాస్తు రుసుము పెంచడంతో పలువురు టెండర్లకు ఆసక్తి చూపకపోవచ్చని మద్య ం వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే సిండికేట్‌గా మారి అయిన టెండర్లు వేయాలని పలువురు మద్యం వ్యాపారులు ఆలోచిస్తున్నారు.

**నేటి నుంచి దరఖాస్తులు**

మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించిన మార్గదర్శకాలు రాష్ట్రప్రభుత్వం జారీచేసింది. జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబరు 18వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబరు 23న లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించనున్నారు. రెండేళ్ల అనుమతులతో ఎక్సైజ్‌శాఖ కొత్తలైసెన్స్‌లు జారీచేయనుంది. దుకాణాల కేటాయింపులో గౌడసామాజిక వర్గానికి 15శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్ల కల్పించనున్నారు. దరఖాస్తులకు కుల ధ్రువీకరణ తప్పనిసరి చేశారు.

**జిల్లాలో 49 మద్యం దుకాణాలు**

రాష్ట్ర ప్రభుత్వం ఆరేళ్ల నుంచి ఆరేండ్ల నుంచి అమలు (మిగతా 8వ పేజీలో)

### 14 దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని 49 మద్యం దుకాణాలలో 14 మద్యం దుకాణాలకు రిజర్వేషన్‌లు ఖరారు అయినట్లు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో లక్కీడ్రా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడకులానికి 7, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2 దుకాణాలు కేటాయించగా 35 జనరల్ కేటగిరిలో ఉన్నట్లు తెలిపారు.ఎంపిక చేసిన వాటిని ఆమోదానికి రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ కమీషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎక్సైజ్ సూపరిటెండేంట్ హనుమంత్‌రావు, ఎస్సీ,ఎస్టీ, బీసీ అధికారులు,అబ్కారిశాఖాధికారులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

### ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు
## నిబంధనలు పాటించాలి

» కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డిస్టిక్ రిజిస్ట్రేషన్ అథారిటి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు ప్రభుత్వ అనుమతి తీసుకున్న తర్వాతే ఆసుపత్రి నడపాలని అన్నారు. అనుమతిలేని ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అర్హత లేనివారు వైద్యం చేస్తే ఆసుపత్రులను సీజ్ చేయాలని తెలిపారు. వైద్యశాఖ అధికారులు విధిగా ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీచేసి రిజిస్ట్రేషన్‌ను పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేష్‌చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్ విక్టర్, డీయంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**సంప్రదాయాలను కాపాడేందుకే బతుకమ్మ పండుగ**

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడమే బతుకమ్మ పండుగ ముఖ్యఉద్దేశమని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సంస్కృతి సంప్రదాయాలను కాపాడడానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. బతుకమ్మ పండుగకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని, మహిళా ఉద్యోగులకు కూడా వేడుకలను నిర్వహించేలా కృషిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరిటెండెంట్ హనుమంత్‌రావు, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### 'స్థానిక' ఎన్నికలపై
## రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

ఎల్లారెడ్డిరూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని మీసన్‌పల్లి గ్రామంలో గల రైతువేదికలో గురువారం స్థానిక ఎన్నికలపై ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట్ రిటర్నింగ్ అధికారులకు గురువారం శిక్షణ నిర్వహించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు చేపట్టాల్సి బాధ్యతలు, నిబంధనలు, పారదర్శకత, న్యాయబద్ధతపై శిక్షకులు మార్గదర్శకాలు అందించారు. ఈ శిక్షణలో నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల పరిశీలన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, ఈవీఎంల భద్రత, ఓటింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌటింగ్ విధానం, ఫలితాల ప్రకటన అంశాలపై ప్రత్యే దృష్టి సారించాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

### అంతరాష్ట్ర దొంగలపై పీడీ యాక్ట్: ఎస్పీ

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలలో రహదారులపై వాహనదారులను లక్ష్యంగా చేసుకుని మరణాయుధాలతో దాడులుచేసి దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్రదొంగలపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం తెలిపారు. బీదర్‌కు చెందిన కృష్ణబాబు, నాందేడ్‌కు చెందిన నామ్‌దేవ్‌రాథోడ్ అజిత్‌రమేష్‌లను సదాశివనగర్‌సీఐ, గాంధారి ఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబు ల్ నర్సింలు నిజామాబాద్ సెంట్రల్ జైలులో అప్పగించారని తెలిపారు. వీరిపై గతంలో ఉద్గిరిరూరల్, నీలంగా పీఎస్‌లలో కేసులు ఉన్నట్లు తెలిపారు.

## దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు : డీఎం



జుక్కల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను సందర్భంగా హైదరాబాద్ నుంచి బాన్సువాడ వరకు పండుగలకు సొంతఊర్లకు వచ్చే ప్రయాణికుల కోసం స్పెషల్ బస్సులు డీలక్స్ లగ్జరీ బస్సులు ఏర్పాట్లు చేసినట్లు బాన్సువాడ ఆర్టీసీ డీఎం సరిత దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జేబీఎస్ బస్టాండ్ నుంచి ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. పండుగకు వచ్చే ప్రయాణికులు తిరుగు ప్రయాణం అయ్యేవరకు ఈనెల 27 నుంచి వచ్చేనెల 6 వరకు సేవలు అందిస్తాయని తెలిపారు. ప్రయాణం చేసిన ప్రయాణికులు వారు తీసుకున్న టికెట్‌పై ఫోన్‌నెంబర్ రాసి బాన్సువాడ బస్టాండ్‌లో లక్కీడ్రా బాక్స్‌లో టికెట్ వేయాలని ఆమె కోరారు. దివ్యాంగులు, వృద్ధులకు యాత్ర దానం నిర్వహించుటకు ఎన్ఆర్ఐలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చాలా సురక్షితమని ప్రయాణికులకు వారి గమ్యస్థానాలకు చేరుస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమ రూ.15వేలు, మూడో బహుమతి రూ.10 వేల నగదు ఇస్తామని తెలిపారు. ప్రయాణికులు దసరా బస్సులను సద్వినియోగం చేసుకొని పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని ఆమె కోరారు.

### తెలంగాణ సంస్కృతికి
## ప్రతిబింబం బతుకమ్మ

» బతుకమ్మ వేడుకల్లో కుటుంబంతో సహా పాల్గొంటా
» ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ



షబ్బీర్‌అలీకి ఆహ్వాన పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భిక్కనూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతిబింబమని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం ఈనెల 27న భిక్కనూరు మండలకేంద్రంలో నిర్వహించే బతుకమ్మ సంబరాలకు హాజరుకావాలని మండల కాంగ్రెస్ నాయకులు షబ్బీర్‌అలీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, బతుకమ్మ పండుగను ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించాలన్నారు. మహిళలకు పండుగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భిక్కనూరు బతుకమ్మ సంబరాల్లో కుటుంబంతో సహా వచ్చి పాల్గొంటానని ఆయన కాంగ్రెస్ నాయకులతో తెలిపారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా ఉండే బతుకమ్మలకు, బతుకమ్మ పాటలు పాడే మహిళలకు బహుమతులు అందజేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్‌గౌడ్, యువజన అధ్యక్షుడు వెంకటేష్, విండోఛైర్మన్ భూమయ్య, పట్టణ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

### విశ్రాంత ఉద్యోగులకు
## అండగా ఉంటా

» ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని చైతన్యకాలనీలో ఏర్పాటుచేసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవన నిర్మాణం కోసం 250 గజాల స్థలం ఇప్పిస్తానని, భవన నిర్మాణం కోసం రూ.10లక్షలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని విశ్రాంత ఉద్యోగులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, ఆనందం, పద్మారావు, లక్ష్మీకరవడి, కౌసర్, శంకర్, మహమూద్, మనోహర్, రాములు, సాయన్న ఉన్నారు.



జుక్కల్ గోదాంలను పరిశీలిస్తున్న ఇక్రిశాట్ అధికారులు



నియోజకవర్గంలో సాగవుతున్న సోయా పంట

## జుక్కల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

» నెరవేరనున్నరైతన్నల కల
» పంట విక్రయాలు సులభం
» యువతకు ఉపాధి అవకాశాలు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గ సోయా రైతుల కల నెరవేరనుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తోట లక్ష్మీకాంతరావ్ నియోజకవర్గంలో సోయాప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయిస్తానని ఇచ్చిన హామీ నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ ఖరీఫ్‌లో రైతన్నలు అధిక మొత్తంలో సోయా సాగు చేస్తారు. కానీ పంట విక్రయానికి కష్టతరంగా ఉండేది. తాజాగా ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు యూనిట్ ఏర్పాటుకు సంబంధించి బుధవారం నియోజకవర్గంలో పర్యటించారు. జుక్కల్ మండలకేంద్రంలో సోయా పంటను పరిశీలిం చడంతోపాటు, సోయా పంట నిల్వకు అవసరమైన గోదాంలను పరిశీలించారు. అంతేకాకుండా పప్పు దినుసుల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి కూడా సమీక్షించారు. ప్రాసెసింగ్ యూనిట్లకు అవసరమయ్యే ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే సూచించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేపట్టారు.

**పంట విక్రయాలు సులభతరం..**

గడిచిన ఏడాది కాలంగా నియోజకవర్గంలో సోయా పంటను అధికంగా సాగుచేస్తున్నప్పటికీ పంట (మిగతా 8వ పేజీలో)

### యువతకు ఉపాధి

• తోట లక్ష్మీకాంతరావ్



జుక్కల్ నియోజకవర్గంలో సోయా, పప్పు యూనిట్ల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌లు ఏర్పాటు అయితే పంటను నేరుగా రైతుల నుంచి కొనుగోలు కానుండటంతో రైతులకు మేలు జరుగుతుంది. యువతకు సైతం ఉపాధి కలుగుతుంది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్న సోయా, పప్పు ప్రాసెసింగ్ యూనిట్లను త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం.

యాదిలో..



### సౌభాగ్యాన్ని అందించే పండుగ

బతుకమ్మను మహిళలకు సౌభాగ్యాన్ని అందించే పండుగగా జరుపుకుంటారు. బతుకమ్మ ఆట పాటలు, నాట్యంలోనూ గొప్ప సాహిత్యం ఉంటుంది. ఎంగిలిపువ్వు బతుకమ్మ మొదలుకొని సద్దుల బతుకమ్మ వరకు బతుకమ్మ ఆడటం, వివిధ రకాల నైవేద్యాలు సమర్పించుకోవడం మహిళలు ప్రత్యేకంగా భావిస్తారు. ఎన్నో వేల ఏళ్ల చరిత్ర కలిగిన బతుకమ్మ పండుగ మహిళలు గొప్ప వరంగా భావిస్తారు. - జ్యోతి, రచయిత్రి



### తెలంగాణ వచ్చాక వేడుకలకు ఉత్సాహం

తెలంగాణ ఏర్పడిన తర్వాత బతుకమ్మ వేడుకలు ప్రతివాడలో జరుపుకునే సంప్రదాయం నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగను మొట్టమొదటగా రాష్ట్ర పండుగగా గుర్తించింది. రోజుకొక ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించారు. చిన్నప్పటి నుంచి తల్లిగారి ఇంట్లో స్నేహితులతో కలిసి పండుగను ఎంతో సంబురంగా జరుపుకుంటున్నా. - సుమనారెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్



### మా గల్లీలో సందడే సందడి

మాది నగరంలోని కోటగల్లి చిన్నప్పటినుంచే బతుకమ్మ అంటే మా గల్లీలో సందడి వాతావరణం ఉండేది. చిన్నప్పుడు స్కూల్ నుంచి రాగానే వారం రోజులు బతుకమ్మలను ఆడుతూ గడిపేవాళ్లం. ప్రసాదంగా పెసరపప్పు చక్కెర, అటుకులు బెల్లం తీసుకువెళ్లే వాళ్లం. బతుకమ్మ ఆడిన తర్వాత అందరం కలిసి కూర్చొని ఒకరి ప్రసాదం ఒకరం పంచుకొని తినేవాళ్లం.
- సుధాం లక్ష్మి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు, నిజామాబాద్





# క్రైం సమాచారం

## బాల్యవివాహం.. యువకుడిపై కేసు

మహమ్మద్‌నగర్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన మైనర్ అమ్మాయిని వివాహం చేసుకున్న అదే గ్రామానికి చెందిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ గురువారం తెలిపారు. మైనర్‌ను బలవంతంగా వివాహం చేసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసుకున్నా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కంటెయినర్‌ను ఢీకొన్న బస్సు

ఇందల్వాయి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటెయినర్‌ను ప్రైవేటు ట్రావెల్ బస్సు గురువారం ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న 9మందికి తీవ్ర గాయా లయ్యాయి. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సు సుదపల్లి సమీపంలో కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సులోని 27 మంది ప్రయాణికుల్లో 9మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి ఎస్సై షరీఫ్ చేరుకొని గాయపడిన వారిని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కంటెయినర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## 16 మంది జూదరుల అరెస్టు

మోస్రా,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు 2 చోట్ల టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీసీఎస్ ఎస్సై గోవింద్, మహేష్, సిబ్బందితో కలిసి మెరుపుదాడి నిర్వహించారు. వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని మోస్రాలో రైడ్ చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7 సెల్‌ఫోన్‌లు, రూ.13,300 స్వాధీనం చేసుకొని వర్ని ఎస్సైకి అప్పగించారు. మోస్రాలోని మరో స్థావరంపై దాడి చేసి 9 మందిని పట్టుకున్నారు. వారి నుంచి 8సెల్ ఫోన్‌లు, రూ.11,930 నగదు స్వాధీనం చేసుకున్నారు.

**నాగేపూర్‌లో 12 మంది..**

నవీపేట,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్ శివారులో బుధవారం రాత్రి 12మంది జూదరులను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వారి నుంచి రూ.8,430 నగదు, 8 సెల్‌ఫోన్‌లు, 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పక్కా సమచారం మేరకు దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదుచేశామని వివరించారు.

## కుక్క దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బీర్కూర్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంగేడ్గిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గురువారం గ్రామంలో చైనాపురం కామప్ప రహదారిపై వెళ్తున్న క్రమంలో ఒక పిచ్చికుక్క దాడిచేయగా.. ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి కుక్కను తరిమికొట్టారు. అనంతరం కామప్పను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివాజీ

ఆర్మూర్, సెప్టెంబరు 25:(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్‌లోని పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో శివాజీ పేర్కొన్నారు. గురువారం ఆర్మూర్‌లోని ఎమ్మార్సీలో అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, పీఆర్ ఏఈ నితీష్, హెచ్‌ఎంలు నవీన్, కేతనకుమారి, కవిత, ఇందిర, విజయకుమార్, అనసూయ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

నవీపేట,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాన్ ఫారంలో శుక్రవారం 33/11 సబ్ స్టేషన్ నిర్మాణానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి భూమిపూజ చేయనున్నారని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సుమారు రూ.2 కోట్లతో సబ్‌స్టేషన్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో సమీప గ్రామాల విద్యుత్ వినియోగదారులకు సౌకర్యంగా ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

## గీతకార్మికుడికి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న గడ్కోల్ మాజీ సర్పంచ్ దేవాగౌడ్

సిరికొండ,సెప్టెంబర్25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి యూఏఈ కౌండిన్య కమిటీ సభ్యులు రూ.90 వేల ఆర్థిక సాయం అందజేశారు. యూఏఈ కౌండిన్య కమిటీ ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తరఫున గడ్కోల్ మాజీ సర్పంచ్ దేవాగౌడ్ నగదును అందజేశారు. శ్రీనివాస్‌గౌడ్ తాటిచెట్టుపై నుంచి పడిపోవడంతో కాళ్లు విరగగా.. చికిత్స నిమిత్తం ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వంశీగౌడ్, మేమ్‌సా బ్యాంక్ ఫౌండర్ సీఈవో శ్రీనివాస్‌గౌడ్, ఆర్మూర్ రాజేందర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, గణేష్‌గౌడ్, రామాగౌడ్ పాల్గొన్నారు.

## మినీ ట్యాంక్‌బండ్ వద్ద స్వచ్ఛతా హీ సేవా

సుభాష్‌నగర్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రఘునాథ చెరువు, మినీ ట్యాంక్‌బండ్ వద్ద గురువారం శ్రమదానంచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ హాజరయ్యారు. ట్యాంక్‌బండ్ ఆవరణలోగల చెత్తను ఉద్యోగులతో కలిసి తొలగించారు. బతుకమ్మ పండుగకు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవిబాబు, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్‌అలీ, ఇన్‌స్పెక్టర్లు మహిపాల్, సునీల్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

**హంగర్గలో శ్రమదానం**

కోటగిరి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పలు కాలనీల్లో శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ హంగర్గ గంగాధర్, ఉదయ్ భాస్కర్, నాయకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూరల్ ఎమ్మెల్యే పరామర్శ

సిరికొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ, మైలారం గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురువారం పరామర్శించారు. దువ్వూరు సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజపండరి, కేఎస్‌గౌడ్ కుటుంబాలను పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## బీఆర్ఎస్ రూ.కోట్ల అప్పులు చేసింది



సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.కోట్ల అప్పులు చేసినా.. కరెంట్ సరఫరాలో నిర్లక్ష్యం వహించిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మండిపడ్డారు. బోధన్ నియోజకవర్గానికి కనీసం ఒక్క సబ్ స్టేషన్‌ను మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. గురువారం పట్టణంలోని ఆచన్‌పల్లిలో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. సబ్‌స్టేషన్‌కు రూ.2.2కోట్లు మంజూరుచేసినట్లు చెప్పారు. ప్రజల కరెంట్ అవసరాలను తీర్చడానికి తమ ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌దేని పేర్కొన్నారు. ప్రజలకు కరెంట్ ఇబ్బందులు కలగకుండా చూడాలని, సబ్‌స్టేషన్ పనులను 3 నెలల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వానలకు మంజీర, గోదావరి వరదలతో పొలాల్లో 1280 ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయని, యుద్ధప్రాతిపాదికన విద్యుత్ అధికారులు 800 ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేశారని అభినందించారు. ఆచన్‌పల్లి, జాడిజమాల్‌పూర్, హనుమాన్ ఫారంలో3 సబ్ స్టేషన్‌లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, విద్యుత్తు శాఖ ఎస్ఈ రవీందర్, డీఈ ముక్తార్, డీఈ కన్సల్టెంట్ వెంకటరమణ, ఏడీఈలు నగేష్ కుమార్, రాజశేఖర్, ఏఈ నాయిని కృష్ణ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కరించండి



ట్రాన్స్‌కో ఏడీతో ఫోన్‌లో మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్,సెప్టెంబరు25:(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కరెంటు సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఫోన్‌ద్వారా ట్రాన్స్‌కో ఏడీని ఆదేశించారు. వేల్పూర్ గ్రామస్థులు గురువారం ఎమ్మెల్యేను కలిసి బీసీ కాలనీలో ఎదురవుతున్న విద్యుత్ సమస్యను వివరించారు.దీంతో ఆయన ట్రాన్స్‌కో ఏడీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడ ఇబ్బందులు ఎదురైనా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సత్యం, సొసైటీ డైరెక్టర్ భోజన్న యాదవ్, మాజీ ఎంపీటీసీ రాము, వీడీసీ మాజీ అధ్యక్షుడు కమలేష్, కాలనీవాసులు ఉన్నారు.

## లయన్ శ్యామ్‌సుందర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్యామ్‌సుందర్

రుద్రూరు,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ వాసి లయన్ శ్యామ్ సుందర్ పహాడే అరుదైన రాక్ స్టార్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్, ఇంటర్నేషనల్ పిన్‌కు ఎంపిక చేశారు. ఈ అవార్డు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 216దేశాల్లోని క్లబ్‌లలో కేవలం కొందరినే వరిస్తుంది. ఈ అవార్డును శ్యామ్‌సుందర్ పహాడే అందుకోవడంతో పలువురు ఆయనను అభినందించారు.

## బిల్లుల చెల్లింపులో రాజకీయం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న లబ్ధిదారులు

కోటగిరి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న తాము బిల్లుల కోసం ప్రయత్నిస్తే కొందరు రాజకీయాలు చేస్తున్నారని, ఇది తగదని లబ్ధిదారులు వాపోయారు. మండలకేంద్రంలో గురువారం వారు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించుకుంటే.. రెండేళ్లయినా బిల్లులు చెల్లించడం లేదన్నారు. హౌసింగ్ ఏఈ నాగేశ్వర్ రావు ఇంటి చుట్టూ తిరిగినా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. తమ ఇళ్ల బిల్లుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తే కొందరు నాయకులు తాము రాజకీయం చేస్తున్నామంటూ మాట్లాడడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ గౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్రూప్-1లో 'బోధన్' మెరుపులు

**బోధన్ డివిజన్ చెందిన పలువురు గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నా.. ఖాళీ సమయంలో చదువుకొని కొలువులు సాధించారు. వారి ఎంపికపై డివిజన్‌వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

### డీపీవో కొలువు కొట్టిన వినోద్



నవీపేట,సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీకి చెందిన జీ.వినోద్‌కుమార్ గ్రూప్-1 పరీక్షలో సత్తాచాటి డీపీవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వినోద్ ప్రస్తుతం రెంజల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నాడు. ఉన్నత ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యంతో గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాలలో ఆయన ఉత్తీర్ణత సాధించాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో డీపీవో ఉద్యోగాన్ని సాధించాడు. వినోద్‌కుమార్‌కు తల్లి భోజమ్మ ఉన్నారు. తండ్రి సాయిలు గతేడాది మృతిచెందారు. వినోద్ డీఈడీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ చదివాడు. తన ఉన్నత చదువులకు బోధన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సోదరుడు దీపక్, సిద్దిపేటలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సోదరుడు అనిల్‌కుమార్ ఎంతగానో సహకరించారని తెలిపాడు. గ్రామానికి చెందిన వినోద్ డీపీవో ఉద్యోగానికి ఎంపికవడంపై అందరూ హర్షం వ్యక్తం చేశారు.

### అసిస్టెంట్ ట్రెజరర్‌గా దీప



బోధన్,సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన మిర్జాపురం దీప సత్తా చాటింది. ప్రస్తుతం బోధన్ కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహి స్తున్న దీప గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో సత్తా చాటి అసిస్టెంట్ ట్రెజరర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబీకుల ప్రోత్సహంతోనే ఉద్యోగాలు సాధించానని, చాలా ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. పట్టణ ప్రముఖులు దీపను అభినందించారు.



సాలూరలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు





ఉప్లూర్‌లో కుష్మాండ అవతారంలో దుర్గామాత, వేడుకల్లో పాల్గొన్న దుర్గాభక్తులు

# కుంకుమార్చనలు.. ప్రత్యేక పూజలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆయా దుర్గామండపాల వద్ద గురువారం కుంకుమార్చనలు, ఇతర ప్రత్యేకపూజలు చేపట్టారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ బాలరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కొలువైన అమ్మవారు కుష్మాండ అవతారంలో దర్శనమిచ్చారు. ఆయా కార్యాక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

## క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



క్రీడాజ్యోతిని పట్టుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల బాలబాలికల 35వ జూనియర్ కబడ్డీ పోటీలను బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముప్కాల్ క్రీడలకు పుట్టినిళ్లు లాంటిదని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి ఎందరో జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. తన తండ్రి సురేందర్‌రెడ్డి జాతీయస్థాయిలో ఆడారని చెప్పారు. బాల్కొండ నియోజకవర్గంలో క్రీడలు ఎక్కువగా నిర్వహిస్తున్నారని, దానికి కారణం ఇక్కడ ఉన్న క్రీడాభిమానులు, పీడీలు, పీఈటీలు అన్నారు. విద్యార్థులు క్రీడలను స్పోర్టీవ్‌గా తీసుకోవాలన్నారు. ఓడితే నిరాశ చెందకుండా ఒక్కో మెట్టు ఎక్కుతూ జాతీయస్థాయిలో ఎదిగేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ తీర్మానాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ రవి

సాలూర,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని హున్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చేపట్టిన మహాజన సభలో రైతుల సమక్షంలో చేసిన తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సొసైటీ చైర్మన్ మందర్నా రవి ప్రభుత్వాన్ని కోరారు. చైర్మన్ అధ్యక్షతన గురువారం సొసైటీ ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. సంఘ డైరెక్టర్లు, రైతుల సమక్షంలో సంఘ సీఈవో హన్మంత్‌రావు 2024-25 కాలానికి సంబంధించిన జమ, ఖర్చుల లెక్కలను వివరించారు. సంఘం అభివృద్ధి విషయాలపై రైతులతో చర్చించారు. డైరెక్టర్లు, రైతుల సమక్షంలో పలు తీర్మానాలు చేశారు. ఇటీవల వరదల కారణంగా మందర్నా, హున్సా, ఖాజాపూర్ గ్రామాల్లో పంటలు మునిగి పూర్తిస్థాయిలో నష్టం వాటిని విషయం అందరికి తెలిసిందే. ఎకరాకి రూ.20,000 చొప్పున పరిహారం అందించాలని, రబీ వరి పంటకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ.500 ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ద్వారా వడ్లు, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఐకేపీ ద్వారా కాకుండా సొసైటీ ద్వారా మాత్రమే కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలన్నారు. మందర్నాలో 250ఎంటీ గోదాం నిర్మాణం చేపట్టాలని తీర్మానం చేశారు.

## వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

బోధన్,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మినార్‌పల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి హన్మాండ్లు బదిలీ ఉత్తర్వులు నిలిపివేసి యథాస్థానంలో కొనసాగించాలని సభ్యులు తీర్మానం చేశారు. హన్మాండ్లును బోధన్ సహకార సంఘం కార్యదర్శిగా నియమించడానికి పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పాలకవర్గ సభ్యులు స్పష్టం చేశారు. వరి కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించేలా చూడాలని రైతులు కోరారు. యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు రవీందర్ బాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు, డైరెక్టర్లు కామేశ్వర్‌రావు, దేవయ్య, సుజాత, నారాయణ, సహకార సంఘం సభ్యులు వీర వసంత్‌రావు, షకీల్ పటేల్, మన్సూర్ పటేల్, సాయిరెడ్డి, తారాచందర్, మోతిరాం, రమణ, తదితరులు పాల్గొన్నారు.

**నేడు నాగేపూర్‌లో సొసైటీ మహాజన సభ**

నవీపేట,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్ సొసైటీ మహసభను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ శైలేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు సంఘ కార్యాలయం ఆవరణలో సర్వసభ్య సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సంఘ సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

## రైతులకు పరిహారం చెల్లించాలి

రెంజల్,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపునకు గురై మండలంలోని కందకుర్తి, నీలా, పేపర్‌మిల్, బోర్గాం, తాడ్‌బిలోలిలో పంటలు నీట మునిగిపోవడంతో రైతులు తీవ్రనష్టాన్ని చవిచూశారని బీజేపీ మండలాధ్యక్షుడు యోగేష్ తెలిపారు. పంటలు నీట మునగడంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తుందని ఆయన ఆరోపించారు. గురువారం మండల నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు ప్రసాద్, నాగరాజు, రమేష్, మురళి, రూపేష్, అబ్బన్న, రమణారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీల అరెస్టు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని తలపెట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో అంగన్‌వాడీ సమస్యలపై ధర్నా నిర్వహి ంచేందుకు తరలివెళ్లే అవకాశం ఉండడంతో అంగన్‌వాడీ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## జీపీ కార్మికుల జీతాలు విడుదల చేయాలి

ఇందల్వాయి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంతో పాటు మెంట్రాజ్‌పల్లిలో పంచాయతీ కార్మికులతో గురువారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్మికుల జీతాలను వెంటనే విడుదల చేయాలని జిల్లా కార్యదర్శి గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులతో గ్రామాల్లో వెట్టి చాకిరి చేస్తున్నారని, జీతాలు రాక అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరాలోపు జీతాలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయిలు, శేఖర్, పండు, జావిద్, నారాయణ, గంగవ్వ, తదితరులు ఉన్నారు.

**నవీపేటలో నిరసన**

నవీపేట,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం పంచాయతీ కార్మికులు తమ నిరసన తెలిపారు. పెండింగ్‌లోని 3 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కూర్చుని వారు తమ నిరసన వ్యక్తం చేశారు.



పోతంగల్‌లో సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



స్నేహసొసైటీలో సంబురాలు

# బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..!

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఒక దగ్గర చేర్చారు. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ పాడుతూ సం దడి చేశారు.గాజుల్‌పేట్ రాంమందిర్ వద్ద ఏర్పాటుచేసిన వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పాల్గొన్నారు. స్నేహ సొసైటీ ఫర్ రూ రల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దేవేందర్‌గుప్త పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి సాయిసుధ



నవీపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రెంజల్‌లో నిమజ్జనానికి తీసుకెళ్తున్న స్త్రీలు



తగిలేపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



## పండుగను ఉత్సాహంగా జరుపుకుంటా..

తెలంగాణలో మహిళలకు పెద్దపండుగ బతుకమ్మ పండగ. పూలను దేవతగా పూజించే సంస్కృతి, సాంప్రదాయంగా ఆచారంగా ఉన్న ఈ పండుగను చిన్ననాటి నుండి ఎంతో ఆనందంగా జరుపుకుంటాము. ఉద్యోగరీత్యా బిజీగా ఉన్నప్పటికీ స్థానికంగా ఉన్న మహిళలు, స్నేహితులు, బంధువులతో పండుగను ఉత్సాహంగా జరుపుకుంటాము.

● హిమబిందు, తహసీల్దార్, పాల్వంచ



## తోటివారితో పోటీ పడేవాళ్లం..

బతుకమ్మ మన సాంప్రదాయాలను భావితరాలకు అందించుటకు ఉపయోగపడుతుంది. మా స్వగ్రామం ఆర్మూర్‌లో చిన్నతనంలో పూల సేకరణకు వెళ్లేవాళ్లం. పూలు సేకరించి బతుకమ్మ ఎత్తు పేర్చడంలో తోటివారితో పోటీపడేవాళ్లం, పండుగకు కుటుంబమంతా ఒకే చోట కలవడం ఆనందంగా ఉంటుంది.

● లావణ్య, మాజీ ఎంపీటీసీ, పాల్వంచ



## బతుకమ్మ పండుగంటే చాలా ఇష్టం

చిన్ననాటి నుండి బతుకమ్మ పండుగంటే చాలా ఇష్టం. నా చిన్నతనంలో బతుకమ్మను పేర్చడానికి గునుగు, తంగేడి, ఇతర పూలను సేకరించడానికి ప్రతిరోజు ఉదయం స్నేహితులందరం కలిసి వెళ్లేవాళ్లం. తీసుకొచ్చిన పూలతో బతుకమ్మ పేర్చి సాయంత్రం స్థానిక చౌరస్తా వద్ద పెట్టి బతుకమ్మ ఆడేవాళ్లం. ఇప్పటికీ బతుకమ్మ పండుగను ఏటాఘనంగా జరుపుకుంటాం.

● బల్యాల రేఖ సుదర్శన్, మాజీ ఎంపీపీ, భిక్కనూరు







బాధిత కుటుంబీకులకు చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

## బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన పిట్లం సాయవ్వకు గురువారం చిన్నకొడప్‌గల్ సహకార సంఘ అధ్యక్షుడు జార నాగిరెడ్డి రూ.2 లక్షల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన పిట్లం గంగబోయి తమ సంఘంలో సభ్యుడుగా ఉన్నందున అతని పేరున జనతా పర్సనల్ యాక్సిడెంట్ బీమా చేయించామని తెలిపారు. అయితే గంగబోయి కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. భార్య సాయవ్వ నామినీ అయినందున బీమా డబ్బులు రూ.2 లక్షలు సాయవ్వకు అందించినట్లు తెలిపారు. సంఘ వైస్ చైర్మన్ గంగాగౌడ్, సీఈవో హన్మాగౌడ్, మాజీ సర్పంచ్ విఠల్, సంఘ డైరెక్టర్లు పెంటయ్య, సాయాగౌడ్, నాయకులు మల్లప్ప పటేల్, గంగా రెడ్డి, ఇస్మాయిల్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి

## రైతుల సంక్షేమం కోసం కృషి

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తున్నామని బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాన్సువాడ సొసైటీ రైతుల సహకారం, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకుసాగుతోందన్నారు. పోచారం సహకారంతో రూ.కోటి నిధులతో భవనం నిర్మించడమే నిదర్శనమన్నారు. అనంతరం సభ్యులతో కలిసి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణరెడ్డి, కొర్ల పోతురెడ్డి, అశోక్‌రెడ్డి, సాయిలు యాదవ్, అలీమోద్దీన్ బాబా ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి బియ్యం పంపిణీ



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఆర్ఐ

మద్నూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో లింబూర్ అంగన్‌వాడీ కేంద్రంలోకి వరద నీళ్లు వచ్చి బియ్యం మొత్తం తడిసిపోయాయి. దీంతో ఆ బియ్యానికి బదులుగా స్థానిక రేషన్ డీలర్ నుంచి అదనంగా మరో 30 కిలోల బియ్యాన్ని డోంగ్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా అంగన్‌వాడీ కేంద్రానికి పంపిణీ చేయించారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా మంచి బియ్యాన్ని పంపిణీ చేయించినట్లు తెలిపారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ టీచర్ సునంద ఆయా పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేని వర్షం.. రైతన్నకు కష్టం

జుక్కల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల వ్యాప్తంగా గురువారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన సోయాపంట కోతకు రావడంతో కురుస్తున్న వర్షాలకు పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలరోజులుగా భారీ వర్షాలు కురవడంతో పంట పొలాల్లో నీరు నిల్వ ఉండి సోయా కాయలు కుళ్ళిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. మరోవైపు పెసర, మినుము పంటలు సైతం పాడయ్యాయని వాపోతున్నారు.

## నెమలి సాయి ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలిసాయి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. నెమలి సాయి ఆలయం మినీ షిరీడిగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# దుర్గమ్మా.. కరుణించమ్మా

నసురుల్లాబాద్, తాడ్వాయి, బాన్సువాడ రూరల్, భిక్కనూరు, దోమకొండ(బీబీపేట), సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గమ్మా.. కరుణించమ్మా అంటూ భక్తులు నిత్యం పూజలు చేస్తున్నారు. నాలుగోరోజు గురువారం అమ్మవారు నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్‌లో, బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ గ్రామంలో అన్నపూర్ణాదేవిగా, తాడ్వాయిలో కాత్యాయిని దేవిగా, భిక్కనూరులో శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం వేళల్లో మండపాల వద్ద దాండియా ఆటలు, అన్నదానాలు, తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంటోంది.



బీబీపేట మండలం జనగామలో భవానీ మాలధారుల పూజలు



ఇబ్రహీంపేట్‌లో అన్నపూర్ణ దేవిగా అమ్మవారి దర్శనం



ఎండ్రియాల్‌లో కాత్యాయిని దేవి అవతారంలో అమ్మవారు



జంగంపల్లిలో అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

# నిరంతరంగా కొత్త రేషన్‌కార్డులు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు నిరంతరంగా అందిస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం 59 లబ్ధిదారులకు సుమారు రూ.28లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని పలు కాలనీలోని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేశామని చెప్పారు. అనారోగ్యంతో అప్పులపాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను నిరంతరంగా అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకంటే ఎక్కువ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ జావిద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

## విజయం కోసం శ్రమించాలి

బీర్కూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కలిసి కట్టుగా శ్రమించాలని రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్ రాజ్ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. గురువారం బీర్కూర్‌లోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ప్రతీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్త ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ తరపున బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపు కోసం వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి కలిసి కట్టుగా శ్రమించాలన్నారు. పార్టీలో శ్రమించే వారికే ప్రాధాన్యం ఉంటుందని అన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ఆవరణలో శ్రమదానం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 25, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని రామాలయం వద్ద ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించి ఆలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేసి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ మేనేజర్ వాసంతి, వార్డు అధికారులు జ్యోతి, అంజయ్య, సూర్య వర్ధన్, సుజాత సుజాత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలోని రామాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## ఓటరు జాబితా పునఃపరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న జాబితా పునఃపరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సబ్ కలెక్టర్లు, ఆర్‌డీవో, తహసీల్దార్లతో ఎస్ఐఆర్ అమలు కోసం చేపడుతున్న కసరత్తు ముందస్తు సన్నద్ధతతపై సమీక్ష జరిపారు. 2002 ఓటరు జాబితాతో కొత్త ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించాలని తహసీల్దార్లకు సూచించారు. తప్పిదాలకు తావులేకుండా కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్, ఎలక్టోరల్ టేబుల్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులన్నీ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూ.. చిత్తూల బొమ్మ..

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం నేర్పుతామని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, సునీత, బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్‌షిండే, తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డి, మద్నూర్, నసురుల్లాబాద్ మండలాల్లోనూ వేడుకలు నిర్వహించారు.



బతుకమ్మ సంబరాల్లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



బతుకమ్మ సంబరాలలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు



బరంగేడ్గిలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## దసరా పండుగకు ఆర్టీసీ లక్కీడ్రా



డిపో మేనేజర్ ఆనంద్

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం ప్రత్యేక లక్కీడ్రా స్కీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు నిజామాబాద్ డిపో-1, 2 మేనేజర్‌లు ఆనంద్, సాయన్నలు తెలిపారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 4 వరకు సెమి డిలక్స్, డీలక్స్, సూపర్‌లగ్జరీ, లహరి, నాన్ ఏసీ, ఏసీ బస్సులలో ప్రయాణించిన ప్రయాణికులు లక్కీడ్రాకు అర్హులని తెలిపారు. ప్రయాణికులు ప్రయాణించిన బస్సు టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నెంబర్ వివరాలు రాసి బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లక్కీడ్రాలో వేయాలని తెలిపారు. సేకరించిన టిక్కెట్‌లను అక్టోబర్ 8వ తేదీన సాయంత్రం 4గంటలకు లక్కీడా నిర్వహించి ముగ్గురు విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. లక్కీడ్రాలో గెలుపొందిన మొదటి విజేతకు 25వేలు, రెండవ విజేతకు 15వేలు, మూడవ విజేతకు 10వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సదఅవకాశాన్ని ప్రయాణికులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

ధర్పల్లి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సీతాయిపేటలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. మహిళల కోసం ఆర్టీసీ, సౌరవిద్యుత్, పెట్రోల్‌బంక్‌లు, రైస్‌మిల్లులు ఏర్పాటు చేసుకోవడానికి వడ్డీలేని రుణాలను అందిస్తున్నామన్నారు. జీఎస్టీపై బీజేపీ నాయకులు పండుగలు చేసుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. 2017లో ప్రారంభించిన ఈ జీఎస్టీ వల్ల ఒక్కో కుటుంబానికి రూ.15వేలు అదనంగా ఖర్చు అయ్యిందని ఆయన విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్తామన్నారు. రూరల్ నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నర్సయ్య, మనోహర్‌రెడ్డి, బేల్దారి కృష్ణ, చెలిమెల మల్లికార్జున్, చెలిమెల శ్రీనివాస్, సుభాష్ సురేందర్‌గౌడ్, లొక్కిడి రాములు, తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమను పరిశీలిస్తున్న ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు

## ఇక్రిశాట్ శాస్త్రవేత్తల పర్యటన

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు25:(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ గ్రామంలోని పసుపు ఉతత్తుల పరిశ్రమను గురువారం ఇక్రిశాట్ శాస్త్రవేత్తల బృంద సభ్యులు సందర్శించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు ఎస్.తమిళసెల్వీ, సీనియర్ అధికారి ప్రియాంక, అసోసియేట్ సైంటిస్ట్, మేనేజర్ కే.రాజశేఖర్ సందర్శించి పసుపు ఉత్పత్తుల కేంద్రంలోని యంత్రాలను, వాటి పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పసుపు పౌడర్ తయారుచేసి మార్కెటింగ్ చేయడం జరుగుతుందని, లోకల్ మార్కెటింగ్‌తో పాటు విదేశాలకు కూడా నాణ్యతగల పసుపు పౌడర్‌ను తయారుచేసి ఎగుమతిచేస్తున్నామని జిల్లా జేఎం కేపీఎం చైర్మన్ తిరుపతి రెడ్డి తెలిపారు. శాస్త్రవేత్తల వెంట జిల్లా పరిశ్రమలశాఖ సీనియర్ అధికారి ప్రశాంత్, రైతు ఉత్పత్తిదారుల డైరెక్టర్‌లు సంతోష్, పుప్పాల నగేష్, పరిశ్రమ సూపర్‌వైజర్ రుత్విక్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త

## బీజేపీ ఆధ్వర్యంలో దీన్‌దయాల్ జయంతి

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, రాకేష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్న వారి నోర్లు మూయించడానికి ఏకాత్మక మానవతావాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మహోన్నత వ్యక్తి పండిత్ దీన్‌దయాల్ అన్నారు. దీన్‌దయాల్ ఆశించినట్లుగా చిట్టచివరి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్న సంకల్పంతో భారతదేశాన్ని శక్తివంతమైన సౌభాగ్యమైన దేశంగా ప్రపంచ దేశాలలో విశ్వగురువుగా నిలబెట్టాలనే ఆశయంతో పునఃనిర్మాణం లక్ష్యంగా బీజేపీ పార్టీ స్థాపించడం జరిగిందన్నారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలన్న శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, అటల్‌జీ, అద్వానీల కల సాకారం చేయాలన్న ఈ దేశాన్ని అఖండ భారతంగా తీర్చిదిద్దాలన్న కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. అనంతరం మారుతినగర్‌లోని స్నేహసొసైటీలో దీన్‌దయాల్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ధన్‌పాల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల వివరాలు తెలపాలి

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రక్రియ వివరాలను తెలపాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను కలిసి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల శాతం, బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలను తెలపాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను ఏ నిబంధన ప్రకారం అమలు చేస్తున్నారో చెప్పాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత శాతం రిజర్వేషన్లు కల్పించారో తెలపాలని కోరారు. రిజర్వేషన్ల కేటాయింపులకు సంబంధించి పూర్తి వివరాలు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు టీచర్స్ పేరెంట్స్ మీటింగ్

ఇందూరు, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌ల ఆధ్వర్యంలో ఈ సమావేశం ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల హాజరు, విద్యాభ్యాసం, ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల మార్కులు ఈ సమావేశంలో తల్లిదండ్రులకు వివరిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## స్వస్థ్‌నారీ-స్వశక్తి పరివార్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్‌నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ఇమ్రాన్ కోరారు. గురువారం బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ వైద్యులు సాయి అశోక్ రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఇమ్రాన్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. వ్యాధుల పట్ల ప్రతిఒక్కరు జాగ్రత్త వహించాలని అన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఈవో రవి, సూపర్‌వైజర్ పాప, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు టీచర్స్ పేరెంట్స్ మీటింగ్: డీఐఈవో

లింగంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం మేగా టీచర్స్ - పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి శేఖ్ సలామ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కళాశాలల్లో టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అన్నిప్రభుత్వ కళాశాలల్లోని అధ్యాపకులు ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన లేఖలతోపాటు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశానికి హాజరై వారి పిల్లల ప్రగతిని తెలుసుకుని మరింత ప్రగతి సాధించేందుకు తగిన సూచనలు చేయాలని, విద్యార్థులు మరింత ప్రగతి సాధించేందుకు కళాశాలల్లో కావాల్సిన వసతులు, వారి ఆలోచనలను తెలియజేయాలని కోరారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అధ్యాపకులకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు తీసుకుంటున్నామని తెలిపారు. సైన్స్ కామర్స్ విద్యార్థులకు ఫిజిక్స్ వాలా ద్వారా ఆన్‌లైన్‌లో బోధన అందిస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులకు నీట్, ఎంసెట్, జేఈఈలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు, ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగే టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

**కామారెడ్డిటౌన్:** కామారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పకుండా మీటింగ్‌కు హాజరై విద్యార్థి హాజరు,చదువు,క్రమశిక్షణ ఇతర వివరాలను తెలుసుకోవాలని కోరారు.



పారాయణం నిర్వహిస్తున్న పండితులు

## చండీసప్తశతి పారాయణం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రోత్సవాలలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌లో గల రాజరాజేశ్వరి దేవిఆలయంలో చండీ సప్తశతి పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా చండీహవనం, ప్రాతకాలపూజ, అభిషేకం, అలంకారములు, హారతి, మంత్రపుష్పములు తదితర క్రతువులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు మణికంఠశర్మ, ధనుజయ్‌శర్మ, తిరుపతి, కృష్ణతేజ, వంశీశర్మ, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు కిట్ల పంపిణీ

దోమకొండ, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో గురువారం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరిన బాధితులు, ఇళ్లు కూలిన కుటుంబాలకు కామారెడ్డి లయన్స్ క్లబ్, మెగా సర్వీస్ యాక్టివిటీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కామారెడ్డి, గొట్టిముక్కుల, దోమకొండ, రాఘవపూర్ తాండలలో బాధితులకు కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహేందర్ కుమార్‌రెడ్డి, సురేష్, శశికాంత్, అమర్‌నాథ్, విజయలక్ష్మి, నర్సింహరాజు, ప్రవీణ్ కుమార్, ప్రదీప్ కుమార్, నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నత్తి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



గొట్టిముక్కులలో కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ప్రజలను చైతన్యం చేసిన
# మహనీయుడు దీన్‌దయాల్



కామారెడ్డిలోని బీజేపీ కార్యాలయంలో నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



తాడ్వాయి బీజేపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న పార్టీ నాయకులు



బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో నివాళ్లర్పిస్తున్న నాయకులు

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ స్థాపనతో ప్రజలను చైతన్యం చేసిన మహనీయుడు పండిట్ దీన్‌దయాల్ అని బీజేపీ పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ పార్టీ చేసిన దేశ విభజన, దేశంలో జరిగిన మార్పులపై రాజకీయ చైతన్యంతో జనసంఘ్ ద్వారా వ్యవసాయం, విద్య, ఆర్థిక అంశాలపై ప్రజలను చైతన్యం చేసిన గొప్ప దార్శనికుడు దీనన్‌దయాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉమేశ్, రామకృష్ణ, వెంకట్, తోట శంకర్, సాయిరెడ్డి, భూమేశ్ ఉన్నారు.

**కామారెడ్డిలో..**

కామారెడ్డిటౌన్: జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పండిట్ దీన్ దయల్ ఉపాధ్యాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు చిట్టచివరి వ్యక్తికి చేరాలనే ఉద్దేశంతో అంత్యోదయ, ఏకాత్మమానవవాద సిద్ధాంతాన్ని పండిట్ దీన్‌దయాళ్‌జీ రూపొందించారని అన్నారు. భారతీయ జనసంఘ్ ద్వారా బీజేపీకి పటిష్ట పునాదులు వేసిన సమర్థులని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, నాయకులు సంతోష్‌రెడ్డి, విఠల్, వెంకట్ రెడ్డి, రాజగోపాల్, రఘు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

**తాడ్వాయిలో..**

తాడ్వాయి: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, అగ్రికల్చర్ రాష్ట్రకన్వీనర్ గంగారెడ్డి, రాష్ట్ర నాయకులు బాపురెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు వెంకట్ రావు, హోటల్ శ్రీను, మండల సీనియర్ నాయకులు బూత్ అధ్యక్షులు కిషన్ రావు, తదితరులు ఉన్నారు.

**లింగంపేట:** మండలంలో గురువారం పండిత్ దీన్‌దయాళ్ జయంతిని ఘనంగా నిర్వంచారు. అందరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని నమ్మిన గొప్ప సామాజిక-సంఘ సంస్కర్త, అర్థశాస్త్రవేత్త, రాజకీయ నాయకులు, భారతీయ జనతాకి పునాదులు వేసిన సమర్థుడని బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలో మొక్కలు నాటి, ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాంలు, ఉదయ్, ఎల్లేషం, బాలయ్య, నవీన్, నరేష్ ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మేనేజర్

## ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి

దోమకొండ(బీబీపేట),సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామ రైతులతో హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ కంపెనీ క్లస్టర్ మేనేజర్ హిమకుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ తోటల సాగు కోసం రైతుల ముందుకు రావాలన్నారు. ఈ పంటతో అధికలాభాలు ఉంటాయని తెలిపారు. చెట్టుకు, డ్రిప్ సబ్సిడీ ఉంటుందని, సంవత్సరానికి ఎకరాకు రూ.4200 మెయింటెనెన్స్ ఖర్చుకు ప్రభుత్వం రైతు అకౌంట్‌లో జమచేస్తుందని తెలిపారు. మధ్యలో నాలుగు సంవత్సరాల వరకు అంతరపంటలు వేయొచ్చని చెప్పారు. నాలుగో సంవత్సరం పంట చేతికొస్తుందని వివరించారు. ఆ తర్వాత మండలంలోనే కలెక్షన్ సెంటర్ ఏర్పాటుచేసి పంటను ప్రభుత్వం కొనుగోలుచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య, ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యపై పదిరోజుల శిక్షణ

సదాశివనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హైటెక్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో పదిరోజుల పాటు ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ రాజారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వృత్తి విద్య నేర్చుకునే విద్యార్థులకు సాధారణ పాఠశాల రోజులతో పాటుగా సెలవు దినాల్లో ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా వారిలో నైపుణ్యత మరింత పెంపొందే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా 10 రోజుల పాటు శిక్షణ అందించి సర్టిఫికెట్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్, శ్రీకాంత్, నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వృత్తి విద్యపై శిక్షణ ఇస్తున్న అధికారులు (ఫైల్)

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ రెడ్డి

మహమ్మద్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండల ఇంచార్జి ఎంపీడీవోగా బాన్సువాడ ఇంచార్జి డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన అనితారెడ్డి నిజాంసాగర్‌కు బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు.

## నేడు కుంకుమార్చన పూజలు

దోమకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని విశ్వహిందు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ దుర్గాదేవి మండపం వద్ద కుంకుమార్చన పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు.

## న్యాయవాదిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు పోర్ట్ పోలియో జడ్జి నందికొండ నర్సింగ్‌రావును గురువారం హైదరాబాద్‌లో కలిశారు. శనివారం జిల్లా కోర్టులో జరిగే కార్యక్రమంలో ఆయన హాజరుకానున్నట్లు తెలిపారు. కోర్టులో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించేందుకు సహకరించాలని కోరామన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందరమేష్, న్యాయవాదులు జగన్నాథం, వెంకటరామిరెడ్డి, శ్రీధర్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్‌అసోసియేషన్ సభ్యులు



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

## గర్భిణులకు వైద్య పరీక్షలు

రాజంపేట,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పీహెచ్‌లో గురువారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయమహాలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజూర్, స్టాఫ్‌నర్సుఇందిరా, ల్యాబ్ టెక్నిషియన్ సంతోష్, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

## నరసింహ ఆలయంలో హోమం

మాచారెడ్డి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలం చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో గురువారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయప్రాంగణంలో సుదర్శన నారసింహ హోమం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభురాంచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం టెండర్లు

(5వ పేజీ తరువాయి)

చేస్తున్న కొత్త మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాలను పెంచుతూ వస్తోంది. 2018-19 సంవత్సరంలో 38 మద్యం దుకాణాలు ఉండగా 2019-21 మద్యం పాలసీలో రెండు వైన్స్‌లను పెంచడంతో ఆ సంఖ్య 40కి చేరింది. 2021-23 మద్యం పాలసీలో 9వైన్స్‌లను పెంచడంతో ఆ సంఖ్య 49కి చేరింది. కాగా ప్రస్తుతం జిల్లాలో 5 ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉన్నాయి. కామారెడ్డి ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 15 మద్యం దుకాణాలు ఉండగా,దోమకొండలో 8, ఎల్లారెడ్డిలో 7, బాన్సువాడలో 9, బిచ్కుంద ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో పరిధిలో 10 వైన్స్‌లు ఉన్నాయి. అయితే ఈ 49 మద్యం దుకాణాల గడువు లీజ్ డిసెంబర్‌లో ముగియనుంది. అయితే 2023లో నిర్వహించిన మద్యం టెండర్లలో 49 దుకాణాలకు 1940 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.38.80 కోట్ల ఆదాయం సమకురింది. అయితే దరఖాస్తు రుసుము రూ.3లక్షలకు ఈ సారి ప్రభుత్వం పెంచింది. అయితే త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించనుంది. వరుసగా పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరిన్ని దరఖాస్తులు వచ్చేఅవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ భావిస్తుంది.

**మద్యం పాలసీ ఇలా..**

2025-27 లీజ్ కాలానికి ప్రభుత్వం రిటైల్ మద్యందుకాణాల ఎంపికను నిర్వహించనుంది.దరఖాస్తులకు గతంలో లాగానే నాన్ రిఫండబుల్ ఫీజును రూ.3 లక్షలుగా నిర్ణయించనున్నట్లు ఎక్సైజ్‌శాఖాధికారులు చెబుతున్నారు. షాప్ ఎక్సైజ్ టాక్స్ స్లాబ్‌లో ఎలాంటి మార్పులేదు. గతంలో సంవత్సరానికి రూ.50 లక్షలు, రూ.55 లక్షల ఎక్సైజ్ ట్యాక్సులు అలాగే ఉంటాయి. టాక్సులు గతంలో నాలుగు వాయిదాల్లో చెల్లించగా ఇప్పుడు ఆరువాయిదాల్లో చెల్లించడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. లైసెన్స్ పొందడానికి ముందు సమర్పించాల్సిన బ్యాంకు గ్యారెంటి గతంలో నాలుగు వాయిదాలు ఉండేవి. ఇప్పుడు కేవలం రెండు వాయిదాలకే పరిమితం చేసింది. రానున్న లిప్‌కాలానికి ప్రస్తుతం బ్యాంక్ గ్యారెంటి వార్షిక ఎక్సైజ్ టాక్స్‌లో కేవలం 25 శాతానికి మాత్రమే 25 నెలల కాలపరిమితితో ఇవ్వాల్సి ఉంటుంది.

**సిద్ధమవుతున్న మద్యం వ్యాపారులు**

ప్రభుత్వం మద్యం దుకాణాలకు ముందుగానే టెండర్లు వేసేందుకు కసరత్తు చేపడుతున్న నేపథ్యంలో మద్యం వ్యాపారులు, ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా పాత మద్యం పాలసీనే అవలంబించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలు అధికంగా ఉంటాయని వ్యాపారులు భావిస్తున్నారు. దీంతో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పోటీ కూడా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉండనున్నది. ఒక్కో దుకాణానికి దరఖాస్తు ఫీజును రూ.3లక్షలు నిర్ణయించగా నలుగురైదుగురు ఆశవాహులు కొంత మొత్తాన్ని సేకరిస్తున్నారు. ఒకరిపై దరఖాస్తులు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్కో దుకాణానికి 10 నుంచి 20 దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. లిక్కర్‌కు మద్యం ప్రియుల నుంచి డిమాండ్ ఉన్న వైన్స్‌లకు పోటీ ఎక్కువ ఉండనుంది.

## జుక్కల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

(5వ పేజీ తరువాయి)

విక్రయానికి రైతన్నలు నానా అగచాట్లు పడుతుంటారు. ప్రధానంగా సోయా విక్రయించే సమయంలో ఆయా సహకార సంఘాల వద్ద గందరగోళం ఏర్పడటంతో ఇబ్బందులు పడ్డ సందర్భాలు ఎన్నో. ప్రస్తుతం యూనిట్ ఏర్పాటు నిర్ణయంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నిర్వహణ మహిళా సంఘాలదే..!**

నియోజకవర్గంలో ఏర్పాటుచేయనున్న సోయా, పప్పుదినుసుల ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాల చేతికి అప్పగిస్తే ఎలా ఉంటుందన్న అభిప్రాయాన్ని అధికారులు సేకరిస్తున్నారు. యూనిట్ నిర్వహణ సరిగ్గా జరగాలంటే అందుకు సంబంధించిన బాధ్యత మహిళలకైతే బాగా చేయగలరన్న నమ్మకంతో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఉన్నారని సమాచారం. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు పరిశీలించాలంటూ జుక్కల్ ఐకేపీ అధికారులకు జిల్లాధికారులు సూచించారని సమాచారం.

## రేపు కోర్టు ప్రాంగణంలో రక్తదాన శిబిరం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అడ్వకేట్ సొసైటీ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న కోర్టు ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు న్యాయసేవాధికారసంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావు హాజరవుతారని తెలిపారు. రక్తదాతలు ముందస్తుగా పేర్లు నమోదుచేసుకోవాలనుకుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యాలయ నంబర్‌లు 9440169128, 7842255417 నంబర్లకు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

## రామారెడ్డి పీహెచ్‌సీలో వైద్య శిబిరం

రామారెడ్డి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్వస్థనారి - స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక డాక్టర్లతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రామారెడ్డి పీహెచ్‌సీలో రోగులకు రక్త పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్, దీప్తి, కార్తీక్, నవీన్, సచిన్, సత్యశ్రీ ఉన్నారు.

### సినిమా గైడ్

**కామారెడ్డి**

ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

**బాన్సువాడ**

మహేశ్వరి - బ్రహ్మాండ
వెంకటేశ్వర - కూలీ

### చికెన్ ధరలు

| రకం | సుగుణ | వెన్‌కాబ్ |
|---|---|---|
| లైవ్ | రూ.140 | రూ.170 |
| స్కిన్ | రూ.200 | రూ.210 |
| స్కిన్‌లెస్ | రూ. 220 | రూ.230 |

## అంగన్‌వాడీల ముందస్తు అరెస్ట్

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపిస్తూ అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన ఛలో సెక్రెటేరియెట్ కార్యక్రమం నేపథ్యంలో ఎల్లారెడ్డి మండల అంగన్‌వాడీ టీచర్లను గురువారం ఉదయం పోలీసులు అడ్డుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అరెస్ట్ అయిన వారిలో లలిత, సులోచన, శిరోమణి, లక్ష్మీ, సుష్మ, పద్మ, తదితరులు ఉన్నారు.

● లింగంపేట మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా అంగన్‌వాడీ కార్యకర్తల మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో అంగన్‌వాడి కార్యకర్తలు సుజాత, అంజవ్వ, హసీనా, కార్యకర్తలు ఉన్నారు.



లింగంపేటలో ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు




ఎల్లారెడ్డిలో అంగన్‌వాడీ టీచర్లను అరెస్ట్ చేసిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

## ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

భిక్కనూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను గ్రామంలోని ప్రజలంతా ఘనంగా జరుపుకుందామని భిక్కనూరు ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. గురువారం పద్మశాలీ కళ్యాణమండపంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను పాపనికుంటలో నిమజ్జనం చేయాలని, భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలలో రావణ దహన కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహిద్దామని అన్నారు. అన్నిసంఘాల ప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తునికి వేణు, లింబాద్రి, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూమయ్య, రాజిరెడ్డి, బోడ నరేష్, దయాకర్‌రెడ్డి, ప్రభాకర్, బస్వయ్య, విజయ్‌కుమార్‌గౌడ్, ఉప్పరి సాయిలు పాల్గొన్నారు.